ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3 కనిష్ఠం 22.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 7 జూలై 2025


గోండుల కోటలోని కోనేరు


● ఉట్నూర్‌లో సుందరీకరణ పనులు జరుగుతున్న గోండుల కోట

- ఉమ్మడి ఆదిలాబాద్‌లోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనుల్లో జాప్యం
- తప్పని అటవీ శాఖ అడ్డంకులు
- పలుచోట్ల కొనసాగుతూనే ఉన్న పనులు
- ఉట్నూర్ సమీపంలో గోండుల కోట సుందరీకరణ
- పనులను వేగవంతం చేయాలంటున్న ఆదివాసీ, గిరిజనులు

నత్తనడకన!

ఉట్నూర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కోట్లాది రూపాయలతో మంజూరు చేసిన అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయి. అడవుల జిల్లాగా పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లాలో సింహాద్రి పర్వత శ్రేణుల్లో సహజ సిద్ధమైన అందాలను కాపాడడానికి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక ఉమ్మడి జిల్లాలోని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని పనులకు శ్రీకారం చుట్టారు. దట్టమైన అడవులు, పక్షుల కిలకిల రావాలు, వన్య ప్రాణుల దూకుడు, జలజల పారే జలపాతాల పరవళ్లు, కొండకోనల్లో కొలువైన ఆదివాసీల దేవతలు.. ఇవీ ఆదిలాబాద్ జిల్లా సొంతం. అంతేకాకుండా నాటి రాజుల పాలనకు కూడా కేంద్రాలుగా పలు ప్రాంతాలు ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో నిమ్మల రాయుడి పాలన, ఉట్నూర్ ప్రాంతంలో గోండు రాజుల పాలనకు నిలువుటద్దాలుగా గడీలు(కోటలు) ఉన్నాయి.

అటవీ శాఖ అడ్డంకులతో జాప్యం

ఉమ్మడి జిల్లాలోని కుంటాల జలపాతం, సప్తగుండాల జలపాతాల సమీపంలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రభుత్వం 2018-19లో అంకురార్పణ చేసింది. పర్యాటక ప్రాంతం అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో గిరిజన ప్రాంతాలలో గల పల్లె ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు పర్యాటకులను ఆకట్టుకోవాలని తద్వారా ప్రభుత్వానికి సైతం నిధులు రావాలని భావిస్తుంది. కానీ అటవీ ప్రాంతాలలో ఉన్న జలపాతాల వద్ద నిర్మాణాలు చేయడానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో కూడా అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో పాటు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పలు పనులను మంజూరు చేశారు. జిల్లాలోని కుంటాల జలపాతం సమీపంలో పర్యాటకుల కోసం రిసార్ట్, కాంపౌండ్ వాల్, రిసెప్షన్ సెంటర్ నిర్మించడానికి ప్రయత్నాలు చేయడంతో.. అటవీ శాఖ అనుమతులు లభించక పోవడం విడ్డూరం. కాగా కుంటాల గ్రామ సమీపంలో రూ.381.60 లక్షల వ్యయంతో పలు నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సప్తగుండాల ప్రాంతంలో ఉన్న జలపాతాల సమీపంలో అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. అక్కడ కూడా అవీ శాఖ అడ్డంకులు రావడంతో పనులను అక్కడ కాకుండా ఇతర ఇతర ప్రాంతాలలో చేపడుతున్నారు. సప్తగుండాల సమీపంలో చేపట్టాల్సిన రెస్టారెంట్‌ను వడిగూడ ప్రాజెక్టు దగ్గర నిర్మించారు. సప్తగుండాల జలపాతాల సందర్శనకు వచ్చే


● అసంపూర్తిగా ఉన్న గోండుల కోట ప్రధాన ద్వారం పనులు

(తరువాయి 6వ పేజీలో...)


కుంటాల వద్ద నిర్మిస్తున్న కాటేజీలు

అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదు

: మేస్రం దుర్గు పటేల్, ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు



ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న అభివృద్ధి పథకాలను అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరైనది కాదు. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పుడు అటవీ శాఖ అనుమతులు కూడా ఇప్పించి పనులు సత్వరంగా పూర్తి అయ్యేలా చూడాలి. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గోండుల కోట నవీకరణ పనులు వేగవంతం చేయాలి.

అభివృద్ధి పనులు నడుస్తున్నాయి

: జాదవ్ తానాజీ, ఈఈ ఐటీడీఏ, ఉట్నూర్



పర్యాటక, పురావస్తు శాఖల ఆధ్వర్యంలో మంజూరైన పనులు కొనసాగుతున్నాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గోండుల కోటతో పాటు కుంటాల జలపాతం, మిట్ట జలపాతానికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. గోండుల కోటలో పురావస్తు శాఖ అధికారులు పనులను చూసుకుంటున్నారు.


పెంపుడు జంతువులకు రెబిస్ టీకాలను వేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు

పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి : గోపికృష్ణ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ గోపికృష్ణ సూచించారు. ప్రపంచ జునోసిస్ డే ను పురస్కరించుకుని ఆదిలాబాద్‌లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శునకాలకు రేబిస్ టీకాలను వైద్య సిబ్బంది వేశారు.ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డాక్టర్ గోపికిషన్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి వ్యాధులు సోకకుండా సకాలంలో టీకాలు వేయిస్తూ ఉండాలన్నారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులో రెబిస్ వ్యాధి భయంకరమైందని తెలిపారు. ప్రతియేటా శునకాలకు యాంటి రెబిస్ టీకాలను ఉచితంగా పశుసంవర్ధక శాఖ తరఫున అందిస్తున్నామన్నారు. ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటిసారి యాంటి రెబిస్ టీకాను కొనుగొన్న రోజునే వరల్డ్ జునోసిస్‌డే జరుపుకుంటామన్నారు. ఇందులో పశువైద్యుడు గజానన్, దూద్‌రాంరాథోడ్, పద్మ, ఖాజాపాషా, అమిన్, రమేష్, సాజిద్; గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

14న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

ఉట్నూర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అపూర్వ అప్రెంటిషిప్ అవకాశం కల్పించడానికి ఈ నెల 14న తెలంగాణ రాష్ట్ర ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని ఎనిమిది ప్రభుత్వ ఐటీఐలలో ఈ మేళా నిర్వహించబడుతుందని పేర్కొంది. ఈ మేళాలో అన్ని ప్రాంతాల (గ్రామీణ మరియు పట్టణ) ఐటీఐ ఉత్తీర్ణ విద్యార్థులు పాల్గొన వచ్చున్నారు. ఈ మేళాలో రాష్ట్రం మరియు దేశవ్యాప్తంగా పేర పొందిన ప్రముఖ పరిశ్రమలు పాల్గొని అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులను ఎంపిక చేయనున్నా యని, ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశ్రమల ద్వారా స్టైపెండ్ (శిక్షణ వేతనం)అందించబడుతుందని ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఐటీఐ (గిరిజన)ఈ మేళాకు అధికారిక కేంద్రంగా ఎంపిక చేయబడిందని తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని భూపాలపల్లి, భద్రాచలం, ఉట్నూర్, కమ్మర్‌పల్లి, శ్రీరాంపూర్, బిచ్కుంద, వికారాబాద్, ఆటేరు ఐటీఐలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికేట్, 2 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, బయోడేటా పత్రాలతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

9న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక : ఏఈ

నేరడిగొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నేరడిగొండ ఏఈ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్, బజార్ హత్నూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు ఈనెల 9న బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండల కేంద్రంలోని రైతువేదికలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నందున పైన తెలిపిన మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ పరమైన ఏమైనా సమస్యలు ఉన్న వచ్చి ఈ వేదికలో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఏఈ నాగేంద్ర ప్రసాద్ కోరారు.

13న కొట్టాల పోచమ్మ బోనాలు

బోథ్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొట్టాల కోసం ఈనెల 13న నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు బోనాల జాతర ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ వారు తెలిపారు. భక్తులు, పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కప్పర్ల పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

తాంసి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ర్యాంకులు సాధించిన వీరికి బాసర ట్రిపుల్ ఐటీలో చోటు దక్కింది. ఎంపికైన వారిలో కప్పర్ల గ్రామానికి చెందిన గిజ్జ అనుశ్రీ, నాయిని అర్చన, కడదారపు దివ్యలు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం సన్మానించారు. ప్రతీ సంవత్సరం కప్పర్ల పాఠశాల నుంచి ముగ్గురేసి విద్యార్థులు ఎంపిక కావడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారికి ఉపాధ్యాయ బృందం తరఫున శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

సరైన పత్రాలు లేకపోతే వాహనాలను సీజ్ చేస్తాం : ఎస్సై

బోథ్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్ల పెల్లి రూట్‌లో ఆదివారం స్థానిక ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్‌లను తనిఖీ చేశారు. అంతేకాకుండా గతంలో వాహనాలకు వేసిన జరిమానాలను పరిశీలించడం జరిగింది. ప్రతి వాహనానికి తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండాలని, అదేవిధంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు.


మరలపెల్లి రూట్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లాలో ఘనంగా తొలి ఏకాదశి

● వేకువజాము నుంచే ప్రధాన ఆలయాలకు పోటెత్తిన భక్తజనం ● పలుచోట్ల ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాల్లో భక్తులు ఉదయం తెల్లవారు జాము నుంచే పూజాది కార్యక్రమాలను చేపట్టారు. ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశిని ప్రత్యేకంగా భావిస్తారు. కాగా ఆదిలాబాద్‌లోని మార్వాడి ధర్మశాలలో ఉన్న బాలాజీ వేంకటేశ్వర ఆలయం, గోపాలకృష్ణ మఠంలో జరిగిన పూజ కార్యక్రమాలల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి కనిపించింది. స్వామి వారిని ప్రత్యేక హారతులతో కొలిచిన భక్తులు వేదపండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. ఆలయ పూజారులు దైవ దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలను అందచేశారు.కాగా తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాంనగర్‌లో గల విఠల రుక్మబాయి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శనానికి వచ్చిన భక్తులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. వేకువ జాము నుంచే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

ఉట్నూర్: ఆషాఢ మాసంలో వచ్చే హిందువుల తొలి పండుగ ఏకాదశి పండుగను ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా హరే కృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని ఉట్నూర్ మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల నుంచి రాంనగర్ ప్రాంతంలో ఉన్న శివరామ గురుదత్త సాయి కృష్ణ మందిరం వరకు నగర సంకీర్తన శోభాయాత్ర నిర్వహించారు.తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉట్నూర్‌లోని సాయికృష్ణ మందిరంతో పాటు శివాలయం, హనుమాన్ ఆలయం, అయ్యప్ప క్షేత్రంలో భక్తులు పూజలు నిర్వహించారు.

నేరడిగొండ: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఏడీసీ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సురేందర, పిడుగు అభిరామరెడ్డి, వంశీరెడ్డి, తదితరులు ఉన్నారు.

తాంసి: ఏకాదశి పర్వదినాన్ని మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కప్పర్ల, పొన్నారి, హస్నాపూర్, బండలనాగాపూర్, జామిడీ గ్రామాలలో శివలింగాలకు ఆవు పాలతో అభిషేకం చేశారు. మహిళలు కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పుజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నారు. ఏకాదశి సందర్భంగా ఆలయాలాన్ని భక్తులతో నిండుగా కనిపించాయి.

గుడిహత్నూర్: మండల ప్రజలు ఆదివారం తొలిఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే తలంటు స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని పురాతన శివాలయానికి భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఆలయం భక్తులతో కిటకిట లాడింది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయంలో భక్తులు భజన కీర్తనలు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టారు. మండల కేంద్రంలో జరిగిన తొలి ఏకాదశి, మొహరం వేడుకల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని మండల కేంద్రంలో పాండురంగ దిండి నగర ప్రదక్షిణ శోభాయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో పీఏసీఎస్ ఛైర్మన్ ముండే సంజీవ్, మాజీ సర్పంచ్ జాదవ్ సునీత, తదితరులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


గుడిహత్నూర్‌లో పాండురంగ దిండి శోభాయాత్రలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పేదల సంక్షేమం కోసం కృషి : కంది

● లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పేద, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పేదల వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. మొత్తం 3లక్షల 26వేల గల 8చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని వారికి అన్నివిధాల అండగా ఉంటుందని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ నిధుల సహాయం కోసం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పశు సంవర్ధక క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ని అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై, అలాగే రాజకీయ అంశాలపై చర్చించారు. ఆయన వెంట మాజీ ఎంపీ సోయం బాపురావు ఉన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: కుల సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాసేవా భవన్‌లో పది కులసంఘాలకు రూ.5 లక్షల చొప్పున రూ.50 లక్షల ప్రొసిడింగ్ కాపీలను అందించారు. మున్నూరు కాపు, రెడ్డి, రజక, ముదిరాజ్, నాయీబ్రాహ్మణ, గంగపుత్ర, మాదిగ, మాల, గోండ్, లంబాడ కుల సంఘాల భవనాలు, నిర్మాణాలు, వివిధ రకాల మౌలిక వసతులు కల్పించేందుకు ఈ నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కుల సంఘాల ప్రతినిధులు హాజరై ప్రొసిడింగ్ కాపీలను అందుకున్నారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. ఇందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: బేల మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు గిమ్మ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లె, మాజీ మార్కెట్ ఛైర్మన్ వామన్ వాంఖడే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండవార్, పార్టీ సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి, సుదాంరెడ్డి, రాజారెడ్డి, పురుషోత్తంరెడ్డి, సైతాంసీతారాం, కన్యరాజు, తదితరులున్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కందిశ్రీనివాస్‌రెడ్డి

పార్లమెంట్ నేతగా సుధీర్ఘ సేవలు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ● బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నాయకుల నివాళి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని.. దేశ రాజ్యాంగ రచనలో తన పాత్రను వహించి ఎక్కువ కాలం సుధీర్ఘంగా పార్లమెంట్ నేతగా సేవలందించిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం అధికారికంగా బాబుజగ్జీవన్‌రాం 39వ వర్ధంతిని జగ్జీవన్ రాంచౌక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు పరిపాలన వ్యవస్థలను గాడిలో పెట్టే విధంగా సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఆహార కొరత ఉన్నప్పుడు అధిగమించే విధంగా వ్యవసాయ శాఖ మంత్రిగా తీవ్రంగా కృషి చేశారన్నారు. రైల్వేశాఖ, తపాల శాఖలకు ప్రాతినిత్యం వహించి వన్నె తెచ్చారని కొనియాడారు. 50 ఏళ్ల పాటు ఈ దేశానికి సేవలందించారన్నారు. ఇందులో దళిత సంక్షేమ శాఖ అధికారులు మనోహార్, సునిత, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, జగ్జీవన్‌రామ్ కమిటీ అధ్యక్షుడు మల్యాల స్వామి, బీజేపీ నాయకులు లాలా మున్నా, ఆకుల ప్రవీణ్, జోగు రవి, అశోక్, ప్రవీణ్, ఇండ్ల ఎల్లన్న, అడ్వొకేట్ వినయ్‌సాగర్, గుర్రాల ఆశన్న, ఇజ్జగిరి అశోక్, కొల్లూరి శంకర్, కడదారి కిష్టన్న, సంతోష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉట్నూర్: దివంగత ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆదేశాలతో క్యాంప్ ఆఫీస్‌లో జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ఉట్నూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్, ఆర్టీఏ డైరెక్టర్ దూట రాజేశ్వర్, పార్టీ నాయకులు మరసుకోలా తిరుపతి మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధుడని, అణగారిన కులాల ఆశాజ్యోతి అని, ఉప ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తెచ్చి అణగారిన కులాల సంక్షేమం కోసం అనేక విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఇందులో ఆత్రం రాహుల్, అజీమొద్దిన్, కొత్తపెల్లి మహేందర్, అచ్చ దేవనందం, రాజేశ్ నాయక్, పరశురాం, పరమేశ్వర్, మోతీరామ్, హర్షద్, మహిళా నాయకురాలు మల్లమ్మ, తదితరులున్నారు.

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలో దివంగత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళ్లు అర్పించారు. ఇందులో సంఘం పెద్దమనుషులు చౌలమద్ది రంజిత్, మహేష్, రమేష్, సంఘం సభ్యులు చిన్న ధర్మన్న, రవి, బాబు, అశోక్, గంగయ్య, అడెల్లు, పాలు, చిన్న రాజన్న, తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

పేదింటి ఆడ పిల్లలకు కల్యాణలక్ష్మి వరం : బోథ్ ఎమ్మెల్యే

తలమడుగు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి పథకం ఒక వరం లాంటిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ హాజరై ఆయా గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు కళ్యాణ చెక్కులను అందజేశారు. వచ్చిన నిధులను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన మందుల సరస్వతి రూ.20 వేలు, మోక్తీయార్ అలీ రూ.18,500 లచంపూర్ గ్రామానికి చెందిన దొంపల్లి లతేష్ రూ.9 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పేదింటి బిడ్డలకు వరమణి కేసీఆర్ ఏది ప్రారంభించిన అది చరిత్ర అని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, అభిరామిరెడ్డి, సునీత రెడ్డి, జనార్ధన్, సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతర పోస్టర్ల ఆవిష్కరణ

నేరడిగొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేందరంలో ఈనెల 13వ తేదీన జరిగే కొట్టాల పోచమ్మ బోనాల జాతర పోస్టర్లను ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొట్టాల బోనాల జాతరకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కొట్టాల పోచమ్మ బోనాల జాతర ప్రారంభించడం మంచి ఆలోచన అని అన్నారు. అనంతరం ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన షేక్ జాహీద్ హుస్సేన్‌కు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ.18,50, 000ల ఎల్‌వోసీని అందజేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఎల్‌వోసీని ఉపయోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి'

తలమడుగు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగమ్మ గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారి బంగ్లా షెడ్డును ఆదివారం మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సహకారంతో మండలానికి అత్యధిక నిధులు మంజూరు చేసినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన ఏడు లక్షల రూపాయలతో నిర్మించిన సవారి బంగ్లా షెడ్‌ను ప్రారంభించారు. మాజీ జడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, ఎంపిపి కల్యాణం లక్ష్మి రాజేశ్వర్‌లు మాట్లాడుతూ ఇప్పటి వరకు తలమడుగు మండలంలో 12 గ్రామాలలో సవారి బంగ్లా షెడ్లను నిర్మించామని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ హయాంలో మిగతా ఆదివాసి గ్రామాలలో సవారి బంగ్లా షెడ్లను నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు చెన్నల సాయికిరణ్, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, కాంతారావు, సచిన్, ఉడుగు రాకేష్, రావుల నారాయణ, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో మహిళ దారుణ హత్య

● కూతురు ఫిర్యాదుతో సంఘటన వెలుగులోకి.. ● భార్యను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి..
● సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి





వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి (ఇన్‌సెట్‌లో వందన(ఫైల్)

తలమడుగు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన లక్ష్మీపూర్ చెక్‌పోస్టు అటవీ ప్రాంతంలో మహిళ దారుణ హత్య జరిగినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అదిలాబాద్ పట్టణంలోని ఖుర్షిద్ నగర్‌లోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన ఇంగోలి వందన(40), శంకర్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా వందనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో క్షుద్ర పూజలు చేయిస్తానని ఇంట్లో పిల్లలకు చెప్పి బుధవారం భార్య భర్తలు ఇద్దరు ఇంటి నుంచి వెళ్లారు. నాలుగు రోజులైనా తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో పిల్లలకు ఆందోళనకు గురయ్యారు. దీంతో పెద్ద కూతురు ప్రియాంక ఆదిలాబాద్ పట్టణంలోని టూ టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులకు భర్త శంకర్ పైన అనుమానం రావడంతో శంకర్ కోసం గాలించి పట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌కు తీసుకవచ్చి తనదైన శైలిలో విచారించగా.. భార్యకు ఆరోగ్యం బాగోలేదని క్షుద్ర పూజలు చేయిస్తానని అటవీ ప్రాంతానికి తీసుకువచ్చి పసుపు, కుంకుమ, పాలు ఇతర వస్తువులతో ఆమెకు నమ్మబలికి అనంతరం వందనను రాళ్లతో కొట్టి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సరిహద్దు ప్రాంతమైన అటవీ ప్రాంతంలో సంఘటన స్థలానికి వచ్చి చూడగా మృతదేహం కనిపించిందన్నారు. ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ కరుణాకర్ రావు, సీఐ ఫణిందర్, డాక్టర్ లావణ్య, పోలీసు సిబ్బంది పరిశీలించారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ కృషి చిరస్మరణీయం

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ● ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ ● నాయకుల ఘన నివాళి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రతను కాపాడేందుకు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి చేసిన కృషి చిరస్మరణీయమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జి ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఆ మహనీయుడు చూపిన బాటలో కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మనంద్, లాలామున్నా, జోగురవి, ఆకుల ప్రవీణ్, భీంసేన్ రెడ్డి, గొర్లరాము, ఆశీష్ తదతరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: జన సంఘ్ వ్యవస్థాపకుడు డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పూలాజిజీ బాబా విద్యా సంస్థల ఆవరణలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ మాట్లాడుతూ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నినాదం ఒకే దేశం ఒకే ప్రధాని అనే కలను ఈనాడు మన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారతీయ జనతా పార్టీ పాలనలో నెరవేర్చడం జరుగుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ బలోపేతానికి చేసినఎన్నో కార్యక్రమాలు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా నాగపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 97వ బూత్‌లో 11 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీసీనియర్ నాయకులు కొమ్ము రామచందర్, సీపతి లింగాగౌడ్, రాథోడ్ శేషారావ్, లీగల్‌సెల్ నాయకులు భానావత్ జగన్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్దు కిరణ్, మండల కార్యదర్శులు ఎస్.రవీందర్, కాల్వరవి, గంగాధర్, గంట విజయ్, సోషల్ మడియా మండల కన్వీనర్ పొన్నం జగన్ పటేల్, పులిశ్రీకాంత్, పందిరి భీమన్న, కొట్నాక్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్



ఉట్నూర్‌లో ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నత్తనడకన!

(5వ పేజీ తరువాయి...)

పర్యాటకులు మార్లవాయి, వాడిగూడ ఆడ ప్రాజెక్టు ప్రాంతాలలో బస చేయాల్సి ఉండేలా ప్రణాళికలు చేశారు. ఈ మేరకు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరి కొన్ని పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది.

గోండుల కోట సుందరీకరణ

ఉట్నూర్ పట్టణంలోని పాత ఉట్నూర్ సమీపంలో కొమురంభీం ప్రాంగణానికి ఆనుకొని ఉన్న గోండుల కోట సుందరీకరణ పనులు సైతం నెమ్మదిగానే కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఏడాది కావొస్తున్నా.. 60 శాతం పనులు కూడా పూర్తికాక పోవడం పట్ల జిల్లా గిరిజనులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.4కోట్ల వ్యయంతో కోట పునరుద్ధరణ, కోనేరు సుందరీకరణతో పాటు వివిధ పనులు కొనసాగుతున్నాయి. ఆడిటోరియం పనులు పూర్తి కావొచ్చినా.. రంగులు వేయలేదు. రిటైనింగ్ వాల్ పనుల కోసం బండరాళ్లను కరీంనగర్ ప్రాంతం నుంచి.. అలాగే ప్రత్యేక ఇటుకలను రాజమండ్రి ప్రాంతం నుంచి తెప్పించి పనులు చేపడుతున్నారు. ఏది ఏమైనా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం చేపట్టిన పనులు వేగవంతం చేయాలని జిల్లా ప్రజలతో పాటు గిరిజనులు కోరుతున్నారు.

నిధుల మంజూరు పట్ల గ్రామస్థుల హర్షం

బోథ్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయడం పట్ల కౌటా(బి) గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి నిధులు ఇప్పించాలని కోరుతూ మాజీ ఎంపీ మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారికి పలుమార్లు విన్నవించడం జరిగింది. తమ విన్నపం మేరకు నిధులు మంజూరు చేయడం పట్ల ఆలయ కమిటీకి చెందిన వడ్ల శ్రీనివాస్, కళ్యాణ్, మురళీధర్ రెడ్డి, ఎస్‌రామ్‌రెడ్డి, నగేష్‌రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఆలయం పూర్తి చేసేందుకు సహకారం అందించాలని వారు విన్నవించారు.

అంబేద్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

బోథ్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సోనాల మండలం అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మెరుగు మహేష్, ప్రధాన కార్యదర్శిగా సోలోమనరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృతరావు, అంబేద్కర సంఘం మాజీ అధ్యక్షులు మధ్యలో మహేష్ రమేష్ బత్తుల భగత్ ప్రణీత్, అరవింద్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బీజేపీ నాయకులు

జైనథ్, జూలై 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జాతీయ మండలి సభ్యులుగా ఇటీవల ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వగ్రామం అయిన జైనథ్ మండలంలోని అడ గ్రామంలో ఎమ్మెల్యేను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏనుగు రాకేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు కట్కం రాందాస్, సిడాం రాకేష్, పెద్ద లస్మన్న, పొచ్చన్న, అశోక్, వెంకట్‌రెడ్డి, రమేష్, సంతోష్, సాయి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కోసం కృషి చేస్తా

బోథ్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తనపై నమ్మకంతో కట్టబెట్టిన పదవికి తగు న్యాయం చేస్తానని, అంతేగాక రైతాంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానని ఆత్మ చైర్మన్ జి.రాజు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు బి.గోవర్ధన్ రాష్ట్రంలో లా సెట్‌లో మొదటి ర్యాంకు సాధించిన రూతికను, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆత్మ చైర్మన్ రాజు యాదవ్‌లను సన్మానించారు ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రాజు యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టడం వల్ల తాను రైతాంగానికి తగు న్యాయం చేస్తానన్నారు తన పరిధిలోకి వచ్చి అన్ని రకాల శాఖల నుండి రైతులకు అందించే ప్రతి పనిముటును అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎల్. నరేష్, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మున్సిఫ్ సిపిఐ పట్టణ కార్యదర్శి పి. కార్తీక్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం ఎర్రజెండా పార్టీలను అంతం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలి'

నిర్మల్‌రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఎర్రజెండా పార్టీలను అంతం చేయాలనే ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గవర్గ సభ్యులు కలవేని శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పెన్షనర్‌భవన్‌లో 4వ సీపీఐ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో వెయ్యి ఊడల మర్రికి ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వాని నిజాంప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన రాంజీగోండుతోపాటు ఎంతోమంది ఆదివాసీలను ఉరికంబాలు ఎక్కించారన్నారు. ఇంతటి చరిత్ర గల గడ్డను నిర్లక్ష్యంచేస్తూ ఇక్కడున్న నాయకులు శ్రద్ధచూపడం లేదన్నారు. అంగన్‌వాడీటీచర్లను, అంగన్‌వాడీ ఆయాలను కూడా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయవెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ ఉన్నారు.

మహేంద్ర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ

ఖానాపూర్, జూలై6 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర (మేదరి) సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖానాపూర్‌కు చెందిన మదిరె సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం వరంగల్‌లోని శ్రీకన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. తనకు రాష్ట్ర బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర నాయకత్వం నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

నిర్మల్‌రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రియదర్శిని నగర్ ఇండోర్ స్టేడియంలో దివంగత జజాల సుధాకర్‌రావు స్మారకార్థం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా రూరల్, టౌన్ ఎస్సైలు లింబాద్రి, సంజీవ్ పాల్గొన్నారు. ఇందులో జూనియర్ విభాగంలో విజేతలుగా మహేష్, సాగర్, రన్నరప్‌గా సుమన్, రాజు, సీనియర్ విభాగంలో శ్రావణ్, నరేష్,రన్నరప్‌గా సందీప్‌ంలకు బహుమతులు అందజేశారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేయాలి

సారంగాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేయాలని ఆదివారం ఆలయ చైర్మన్ భోజాగౌడ్‌కు కౌట్ల(బి) గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. జాతర కంటేముందే విగ్రహ ప్రతిష్ఠాపనను చేయాలన్నారు.

'సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి'

ఖానాపూర్, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ యాదవ సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని యాదవ సంఘం సభ్యులు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ను కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యాదవ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను యాదవ సంఘం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు (పెద్దగొల్ల)గా దాసరి నడిపి, ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి రాజు యాదవ్, సభ్యులు దాసరి కృష్ణమూర్తి, నాగుల భీమన్న, వేల్పుల అశోక్, రాపెల్లి రాజు, దాసరి సంతోష్, బోడ భీమేష్, తదితరులున్నారు.

వార్డు అభివృద్ధి కమిటీల సమన్వయ సమావేశం

నిర్మల్‌రూరల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌వార్డులో ఉన్న పలు అభివృద్ధి కమిటీల సమన్వయ సమావేశాన్ని ఆదివారం కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో నిర్వహించినట్లు అధ్యక్షులు తెలిపారు. ఎన్టీఆర్ మార్గ్ అభివృద్ధి సంఘం, వేంకటేశ్వర కాలనీ అభివృద్ధి సంఘం, సాగర్ కాలనీ అభివృద్ధి సంఘం, ఛత్రపతి కాలనీ అభివృద్ధిసంఘం, చాణక్యకాలనీ అభివృద్ధి సంఘం, లయన్స్ క్లబ్, పూలాజీ బాబా, పోచమ్మగల్లీ కాలనీవాసుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో సొసైటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



నాట్లు వేస్తున్న రైతులు



నాట్ల కోసం సిద్ధమైన వరి నారు

బోరుబావుల కింద ఊపందుకుంటున్న వరినాట్లు

భైంసా,జూలై6 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో క్రమంగా వరినాట్లు ఊపందుకుంటున్నాయి. భైంసా, ముథోల్ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 3,700 హెక్టార్లలో వరి సాగు చేస్తారు. 3,034 హెక్టార్లలో సాగునీటి పథకాల ద్వారా, 666 హెక్టార్లు వర్షాధారితం ద్వారా వరిని సాగు చేయనున్నట్లుగా అధికారులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం వరుణుడి కరుణ అంతంత మాత్రంగానే ఉండటంతో సాగునీటి వనరుల కింద, వర్షాధారంపై వరిసాగు చేసే రైతాంగం ఇంకా నాట్లను వేసే చర్యలను ఆరంభించలేదు. బోరుబావుల ద్వారా సాగునీటి వ్యవస్థ గల రైతులు వరి నాట్లు వేసే చర్యలను ముమ్మరం చేశారు. గత సంవత్సరం ముథోల్ నియోజకవర్గ పరిధిలోని లోకేశ్వరం మండలంలో 1253 హెక్టార్లలో, ముథోల్ మండలంలో 728 హెక్టార్లలో, భైంసా మండలంలో 1001 హెక్టార్లలో, కుభీర్ మండలంలో 313 హెక్టార్లలో, తానూర్ మండలంలో 313 హెక్టార్లలో, కుంటాల మండలంలో 650 హెక్టార్లలో వరిని సాగుచేశారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వరి నారుమడులు సిద్ధమయ్యాయి. అయితే బోరుబావుల కింద సాగు చేసే రైతాంగం మాత్రమే నాట్లను వేసుకుంటుండగా ఇతర వర్షంపైనే ఆధారపడి నాట్లు వేసే రైతులు మాత్రం వరుణుని కరుణ కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

డొంగుర్‌గాంలో శివపార్వతుల కల్యాణం

నర్సాపూర్(జి), జూలై6 (ఆంధ్రజ్యోతి): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని డొంగుర్‌గాం గ్రామంలోని పురాతన సిద్ధేశ్వర ఆలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేద పండితులు మణికంఠవార్, కైలాస్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

చెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

లక్ష్మణచాంద, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరిగాం గ్రామంలో గల పల్లెప్రకృతి వనంలో చెట్లను నరికిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొరిపెల్లి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. చెట్లను తొలగించి చదును చేసిన స్థలాన్ని ఆదివారం ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక వ్యక్తి మరికొందరితో కలిసి ఈ ఘటనకు పాల్పడ్డారని గ్రామస్థులు తెలిపారని అన్నారు. అధికారంలో ఉన్న వ్యక్తులు అభివృద్ధి చేయాల్సింది పోయి అభివృద్ధిని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ సరిత, ఎస్సై శ్రీనివాస్, ఎంపీడీవో రాధా రాథోడ్‌లకు పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. పోలీసులు తగిన విచారణ జరిపి ఈ చర్యకు పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, అందుకు ఉపయోగించిన జేసీబీ లేదా ట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బూసి మహేష్, బుర్రి భూమేష్, ఇంద్రకరణ్ రెడ్డి, చిన్నయ్య, వాహిద్, గ్రామస్థులు పాల్గొన్నారు.



చెట్లను తొలగించిన పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

నిర్మల్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అక్రమంగా అడ్డగించి, దాడి చేసి, బలవంతంగా బొలెరో వాహనంలో బంధించి కిడ్నాప్ చేసిన ఐదుగురు సభ్యుల ముఠాలో కీలక నిందితుడైన ఇబ్రహీం బిల్డర్ అలియాస్ ఎండీ అబ్దుల్ ఇబ్రహీంను టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మాబాద్‌కు చెందిన షేక్‌రౌఫ్, భైంసాకు చెందిన రైస్ అలియాస్ రాహీజ్ అనే బియ్యం వ్యాపారుల వద్ద రూ.4లక్షల వసూలు చేయడంతోపాటు వారి వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం లక్ష్యంగా ఈ కుట్ర జరిగిందని, ఇందుకోసం భైంసాకు చెందిన ఇటుకల వ్యాపారిగా ఉన్న ఇబ్రహీం బిల్డర్ రూ.1,50,000లకు సుపారి తీసుకొని తన సహచరులు సల్మాన్, మహమ్మద్ సోహెల్, మరో ఇద్దరితో కలిసి ఈ దాడికి పాల్పడ్డారు. ఈనెల 2న భైంసా నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు ద్వారా నిర్మల్ వచ్చి, బైల్ బజార్ ప్రాంతంలో షేక్ తాహెర్ పేరిట రూ. 4లక్షలు తీసుకుంటారని నమ్మించి షేక్ సోఫియాన్, సుమాన్ ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని అడ్డుకుని దాడి చేసి అదే వాహనంలో కిడ్నాప్ చేశారు. 5న నిందితుడు ఇబ్రహీం బిల్డర్ సోఫీనగర్ ప్రాంతంలో ఉన్నాడని పక్కా సమాచారం ఆధారంగా టౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది రైడ్ నిర్వహించి, సోఫీనగర్ దర్గా వద్ద నుంచి నిందితుడిని అరెస్ట్‌చేశారు. అతని వద్ద నుంచి నేరంలో ఉపయోగించిన కత్తి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మిగిలిన నిందితులు పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయన్నారు.

మున్నూరు కాపు నూతన కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్, జూలై6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని బుధవారపేట్ మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మారుగొండ నరేందర్, ఉపాధ్యక్షుడిగా అనుముల మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఉదిగిరి పోశెట్టి, సంయుక్త కార్యదర్శిగా అనుముల రాజేశ్వర్, కోశాధికారిగా లక్కాకుల గిరిధర్, కార్యవర్గ సభ్యులుగా మగ్గిడి వెంకటి, బొమ్మెడ కిషన్, కుమ్మరి వెంకటి, సల్ల కిషన్, అనుముల రాజేందర్, అయిండ్ల రాజస్వామి, బసవేశ్వర్, ఆదుముల్ల నారాయణలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతనంగా ఏర్పడిన కార్యవర్గ సభ్యులను పలువురు శాలువా, పూలమాలతో సత్కరించారు.



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా పీర్ల పండుగ

కుభీర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుభీర్‌తోపాటు మండలంలోని ధార్‌కుభీర్, కుప్టి, తదితర గ్రామాల్లో ఆదివారం పీర్ల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీదుల గుండా పీర్లను ఊరేగించారు. పలువురు ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో యజాస్‌ఖాన్, కమ్రోద్దిన్, అఖిల్, మోస్సిన్, హైమ్మద్, జమిల్, నోమాన్‌లున్నారు.

● పీరీలకు మలీద సమర్పణ

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల్లో గత ఐదు రోజులుగా మొహరం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మునిపెల్లి, పార్‌పెల్లి, చింతల్‌చందా గ్రామాల్లో పీరీలకు తీపి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పీరీలకు తీపి నైవేద్యం సమర్పిస్తున్న దృశ్యం

ఆయిల్‌పామ్ పంటతో అధిక లాభాలు

సారంగాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంటతో అధిక లాభాలు వస్తాయని ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారిని సాదుల మౌనిక అన్నారు. ఆదివారం మండలంలో గల గోపాల్‌పేట్‌లో ఆయిల్‌పామ్ మేఘా ప్లాంటేషన్‌లో భాగంగా మంద శ్రీనివాస్ అనే రైతు మూడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను నాటి రైతులందరు ప్రభుత్వం అందిస్తున్న బిందు సేద్య రాయితీని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రైతులకు ఆయిల్‌పామ్ పంటపై అవగాహన కల్పించారు.



ఆయిల్‌పామ్ మొక్కలను నాటుతున్న దృశ్యం

ఫటా.. ఫట్...

ఆసుపత్రిలో మందుల కొరత లేదు

● డా.యూ.కాశీనాథ్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, భైంసా



ఆంధ్రజ్యోతి: ఏఆర్వీ, ఏఎస్వీ మందుల నిల్వలు ఉన్నాయా.?.

డాక్టర్: ఆసుపత్రిలో కుక్క కాటు, కోతుల దాడిలో గాయపడిన బాధితులతో పాటు పాము కాటు బారిన పడ్డ వారికి చికిత్స నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఇందుకు ప్రధానంగా అవసరమైన ఏఆర్వీ. ఏఎస్వీ మందుల నిల్వలు అన్ని వేళల అందుబాటులో ఉంచుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం భైంసాలో కోతులు దాడులు అధికమయ్యాయి.వీటి బారిన పడిన వారికి మీరిచ్చే వైద్య సలహాలు ఏంటి.?.

డాక్టర్: కోతుల దాడి బారిన పడ్డ బాధితులు వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలివచ్చి అవసరమైన చికిత్సలు నిర్వహించుకోవాలి.ఏఆర్వీ ఇంజక్షన్లను గడువు ప్రకారం ఐదు డోసులు తప్పనిసరిగా తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలి.?.

డాక్టర్: ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత నివ్వాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. కాచి చల్లార్చిన నీటిని సేవించాలి. వేడి వేడి ఆహార పదార్థాలు భుజించాలి. సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

ఆంధ్రజ్యోతి: డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఏంటి .?.

డాక్టర్: డెంగ్యూ జ్వరం ఏడీస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి బారిన పడ్డవారు అధికంగా కీళ్ల నొప్పులతో కూడిన తీవ్ర జ్వరంతో బాధ పడుతారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లి వస్తుంది.

ఆంధ్రజ్యోతి: డెంగ్యూ నివారణ చర్యలు ఏంటి. ?.

డాక్టర్: పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి లేకుండా చూసుకోవాలి. నివాస గృహాల్లోని పూలకుండీలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, పాత టైర్లు, కూలర్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వీటి ద్వారా దోమల వృద్ధి అధికంగా జరిగే అవకాశాలు ఉన్నాయి.అధిక జ్వరంతో బాధపడే వారు వెంటనే సమీప వైద్యశాలలకు వెళ్ళి ఆరోగ్య పరిక్షలు నిర్వహించుకోని వైద్య సేవలు పొందాలి

● (భైంసా, ఆంధ్రజ్యోతి)

లో లెవెల్ వంతెన.. వానొస్తే యాతన!



కుభీర్ మండలంలోని లో లెవెల్ వెంతన

కుభీర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గాల్లో ఏళ్ల క్రిందట నిర్మించిన లోలెవెల్ వంతెనలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. చెరువులు, కుంటలు నిండాక ఓ మోస్తరు వర్షం కురిస్తే చాలు అవి ప్రమాదకరంగా మారుతున్నాయి. మండలంలోని సిర్పెల్లి(హెచ్), బెల్గాం, వీరేగాం, మార్లగొండ, గ్రామాలకు వెళ్లే రహదారుల్లో గల లోలెవెల్ వంతెనలతో ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ మోస్తారు వర్షం కురిస్తే తమ గ్రామానికి గంటల తరబడి రాకపోకలు నిలిచి పోతాయి. వరద ప్రవాహం తగ్గితేనే రాకపోకలు జరుగుతాయి. గతంలో లో లెవెల్ వంతెన దాటుతూ వరద ఉధృతికి కొట్టుకు పోయి పార్డి(బి) గ్రామానికి చెందిన ఓ రైతు మృతి చెందారు. సిర్పెల్లి(హెచ్) లోలెవల్ వంతెనపై బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు, నాయకులకు పలుమార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఇలాంటి వంతెనలు బాగు చేయించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూడాల్సిన అవసరం ఎంతయిన ఉంది.



నర్సరీలో పెంచుతున్న ఆయిల్‌పామ్ మొక్కలు



ఎదిగిన మొక్కలను చూపుతున్న అధికారులు



ఆయిల్ పామ్ మొక్కలను నాటుతున్న హార్టికల్చర్ అధికారులు

ఆయిల్‌పామ్ సాగుకు.. అనుకూలమైన సమయం ఇదే

● ఆదిలాబాద్ జిల్లాలో 2500 ఎకరాల సాగు లక్ష్యం ● 100శాతం సబ్సిడీతో డ్రిప్ ఏర్పాటుకు అవకాశం ● అందుబాటులో ఆయిల్ పాం మొక్కలు

ఆదిలాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా సాగు చేసే పత్తి, సోయా, కంది, జొన్న, మొక్కజొన్న సాంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. డిమాండ్‌కు సరిపడ ఆయిల్‌పామ్ సాగు లేక పోవడంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉంది. దేశీయంగా ఉత్పత్తి భారీగా పెంచాల్సిన అవసరం ఉందని భావించిన ప్రభుత్వం ఆయిల్‌ఫామ్ సాగు రైతులను ప్రోత్సహిస్తూ వస్తుంది. జిల్లాలో ఈ యేడు 2500 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆయిల్ పామ్ సాగును పెంచితే రైతుల ఆదాయం పెరగడంతో పాటు దేశం ఆర్థికంగా ముందుకు వెళ్లే అవకాశం ఉందని హార్టికల్చర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ మద్దతు

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం మద్ధతుగా నిలుస్తుంది. ప్రత్యేకంగా నర్సరీల్లో ఆయిల్ పామ్ మొక్కలను పెంచి భారీ సబ్సిడీ పై రైతులకు అందజేస్తున్నారు. ఆయిల్‌పామ్ మొక్క ధర రూ.193 కాగా కేవలం రూ.20కే రైతులకు అందిస్తున్నారు. మిగతా రూ.173ను ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే పంట నిర్వహణ ఖర్చుల కోసం ఎకరంకు రూ.4200ల చొప్పున నాలుగేళ్ల పాటు ప్రోత్సాహకంగా అందిస్తున్నారు. దీంతో రైతులకు ఆర్థికంగా ఇబ్బందులు ఉండవు. బైబ్యాక్ ఒప్పందం ద్వారా రైతులు ఉత్పత్తి చేసిన పంటను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుంది. ధరల హెచ్చు తగ్గుల నుంచి రైతులను కాపాడేందుకు ప్రతీనెల పారదర్శకంగా ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. దీంతో రైతులకు మద్ధతు ధర దక్కే అవకాశం ఉంటుంది.

అంతర పంటల సాగుకు అవకాశం..

ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటల సాగుకు అవకాశం ఉంటుంది. ఆయిల్ పామ్ మొక్కలు ఎదిగేందుకు సమయం పడుతుంది. దీంతో మొదటి 3 సంవత్సరాల్లో రైతులు ఇతర అంతరపంటలను సాగు చేసు కునే అవకాశం ఉంటుంది. ఇది రైతులకు అదనంగా ఆదాయాన్ని సమ కూర్చుతుంది. తలమడుగు మండలం మదనాపూర్ నర్సరీలో నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 6 సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్, బేల, బోథ్, ఇచ్చోడ, నార్నూర్, ఇంద్రవెల్లి కేంద్రాల్లో పంట దిగుబడిని సేకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం సబ్సిడీ

ఆయిల్‌పామ్‌ను సాగు చేసే రైతులకు ఇరిగేషన్ అవసరాల కోసం వంద శాతం సబ్సిడీ పై డ్రిప్ పరికరాలను అందజేస్తారు. కేటగిరి ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ, బీసీ, చిన్న సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 80శాతం సబ్సిడీపై గరిష్ఠంగా 12.5 ఎకరాల వరకు సబ్సిడీలను అందిస్తారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు ఎన్నో..

- సుధాకర్, (హార్టికల్చర్, అధికారి)



ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభా లు ఎక్కువగా ఉంటాయి. జిల్లా లో 2500ల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించబడింది. 2025-26 యేడాదిలో ఆయిల్ పామ్ సాగును మరింత పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాం. మరో 1500ల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నాం. లక్ష్యాన్ని చేరుకునే విధంగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

ముందస్తు టీకా.. జీవాలకు రక్ష!



కుభీర్‌లో గొర్రెలను మేపేందుకు తీసుకెళ్తున్న కాపరులు

కుభీర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వర్షా కాలంలో గొర్రెలు, మేకల్లో వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. కొత్తగా మొలకెత్తిన గడ్డిపై బురదలోని బ్యాక్టీరియా చేరుతుంది. ఆ గడ్డిని తిన్నప్పుడు జీవాల్లో సమస్యలు తలెత్తుఆయి. ఈ క్రమంలో జీవాల్లో వ్యాపించే పారుడు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న గొర్రెలు, మేకలు 3 నెలల నుంచి ఏడాది లోపు వయసు ఉన్న వాటికి పశువైద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ అందిస్తున్నారు. మండలంలోని మొత్తం గ్రామాల్లో 13 464 గొర్రెలు, 8297 మేకలు ఉన్నాయి. 15 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. పారుడు వ్యాధి ఒక జీవానికి సోకితే మిగతా వాటికి వ్యాపించే అవకాశం ఉంది. అన్ని గ్రామాల్లోని జీవాల్లో పశువైద్యులతో పాటు సిబ్బంది ప్రభుత్వం అందించిన వ్యాక్సిన్ వేస్తున్నారు. వరుసగా వ్యాక్సిన్ అందించడం వల్ల జీవాల్లో పారుడు వ్యాధి తగ్గుతుంది. మరణాల సంఖ్య తక్కువగా ఉంటుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. టీకాలు వేసేందుకు బృందాలుగా ఏర్పడ్డారు. వ్యాక్సిన్ వేశాక వైద్యులు జీవాల సంఖ్యను యాప్‌లో నమోదు చేస్తున్నారు.

● వ్యాధి లక్షణాలు...

ఇది వైరస్ వల్ల వస్తుంది. వ్యాధి సోకినప్పుడు అది ఒక గొర్రె, మేక నుండి మిగతా వాటికి సోకే అవకాశం ఉంది. జీవాలకు అధిక జ్వరం వస్తుంది. మేత మేయకుండా నీరసంగా ఉంటాయి.

● పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలి..

డా. విశ్వజిత్ పాటిల్ మండల పశువైద్యాధికారి కుభీర్



పారుడు వ్యాధి వ్యాక్సిన్ గ్రామాల్లో వేస్తున్నాము. ఇప్పటికే దార్‌కుభీర్, చాత, పార్డి(బి) గ్రామాల్లో గొర్రెలు, మేకలకు వేశాము. మండలంలోని అన్ని గ్రామాల్లో 15 రోజుల పాటు వేయనున్నాము. జీవాల పెంపకం దారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో వ్యాక్సిన్ వేసే ఒక రోజు ముందు తెలియజేస్తాము. లేదా టాంటాం చేయిస్తాం.

రుయ్యాడి పీర్లకు ఘనమైన చరిత్ర

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్



తలమడుగులో పీర్లను ఊరేగింపు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రుయ్యాడి గ్రామానికి చెందిన పీరీలకు ఘనమైన చరిత్ర ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడి తలమడుగు గ్రామాల్లో హసీన్ హుస్సేన్ ఆలయాల్లోని పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుయ్యాడి గ్రామానికి చెందిన పీరీలకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. అదే విధంగా తలమడుగు అసలు ఆలయంలో షెడ్డు నిర్మాణా నికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకున్నారు. కేసీఆర్ హయాంలో అన్ని మతాలకు సమాన అభివృద్ధి జరిగిందన్నారు. తెలంగాణ సీఎంగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రజలకు నమ్మకం ఉందన్నారు. ఒకే రోజు హిందువుల ముస్లింల పండుగ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ తోట వెంకటేష్, పీఎస్‌ఏ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ముడుపు కేదారేశ్వర రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, గంగాధర్, కే.శ్రీనివాస్ రెడ్డి, తోట ప్రమోద్ తోట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీ చంటి పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మత సామరస్యానికి ప్రతికగా భావించే పీరీల పండుగతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి వాతావరణం నెలకొంది. బజార్‌హత్నూర్ మండల కేంద్రంతో పాటు దేగామ, కొల్హారి, పిప్పిరి, గిర్నూర్, గోకొండ, జాతర్ల, మోర్ఖండితో పాటు ఆయా గ్రామాల్లో పీరీల ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు. కర్బల, మౌలాలి,నాలెహైదర్, అలీఅబ్బాస్ తదితర పేర్లున్న పీరీలను నిర్వాహకులు ఉత్సవంలో మత సామరస్యానికి అతీతంగా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. నియమ నిష్టలు పాటిస్తూ మతాల ఐక్యత గ్రామాల్లో ఉట్టిపడుతుంది. ఆదివారం ఐదవ రోజు మలీదలు జరపగా సాయంత్రం ఉత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. రాత్రి వేళల్లో పీరీల బంగ్లా ముందు ఏర్పాటు చేసిన గుండం చుట్టు ప్రతిరోజు యువకులు నృత్యాలతో సందడి చేస్తున్నారు.

తలమడుగు: మొహరం పండుగ అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గత వారం హసన్ హుసేన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం మలిదల పండుగను మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పిండి వంటలు, మలీద ముద్దలు తయారుచేసి పీరీలకు సమర్పించారు. పండుగ సందర్భంగా రుయ్యాడి గ్రామానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి తెలిపారు. నమ్ముకున్న వారికి నమ్ముకున్నంతగా తమ కోరికలు తీరుతున్నాయని నమ్మకంతో మొక్కులు చెల్లించుకుంటున్నామని భక్తులు తెలిపారు.



దిలావర్‌పూర్ కేజీబీవీ పాఠశాల భవనం



కరాటేలో శిక్షణ తీసుకుంటున్న కేజీబీవీ బాలికలు



యోగాలో శిక్షణ తీసుకుంటున్న కేజీబీవీ బాలికలు

బాలికల భవితకు భరోసా కేజీబీవీలు

● డ్రాపౌట్ బాలికలకు వరం ● పౌష్టికాహారం లక్ష్యంగా నూతన మెనూ అమలు ● మానసిక వికాసానికి యోగా, ఆత్మరక్షణకు కరాటే శిక్షణ

దిలావర్‌పూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్య కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు సత్ఫలితాలిస్తున్నాయి. నిరుపేద బాలికల చదువులు మధ్యలో ఆగిపోకుండా వారికి నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కేజీబీవీలను ఏర్పాటు చేసింది ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కేజీబీవీ బాలికలు సైతం చదువుల్లో 'రాణి'స్తున్నారు. కరాటే, యోగా, క్రీడల్లో ప్రతిభ చాటు తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లోను నట విన్యాసాలతో అబ్బుర పరుస్తూ ఔరా... అనిపిస్తున్నారు. తాము ఎందులోను తీసిపోమని నిరూపిస్తున్నారు

డ్రాపౌట్ బాలికలకు వరం కేజీబీవీ..

కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా చాలా మంది బాలికలు మధ్యలో చదువు మానేసి బీడీలు చుడుతూ, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ, ఇటుక బట్టీల్లో వెట్టి చాకిరీ చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండే బాలికలను గుర్తించి వారి చదువు కొనసాగించేందుకు ప్రభుత్వం కేజీబీవీలను ఏర్పాటు చేసింది. పేదరికం పేరుతో బాలికల చదువు ఆగకూడదన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల చదువును ప్రోత్సహిస్తున్నాయి. అసలు ఆడపిల్లకు చదువు ఎందుకన్న నోళ్లతోనే ఆడపిల్లలు చదివితేనే కుటుంబం, తద్వారా సమాజం బాగుపడుతుందన్న మాటలు వచ్చేలా బాలికలు చదువుకుంటూ ముందుకు సాగుతున్నారు. అందుకు కేజీబీవీలు వారికి వరమవుతున్నాయి.

18 కేజీబీవీలు.. 5,900 మంది విద్యార్థినులు..

జిల్లాలో మొత్తం 18 కేజీబీవీ పాఠశాలలు, 16 ఇంటర్ కాలేజీలు న్నాయి. వీటిలో సుమారు 5,900ల మందికి పైగా బాలికలు చదువు కుంటున్నారు. ఇందులో 3,640 మంది బాలికలు కేజీబీవీ పాఠశాల విద్యను అభ్యసిస్తుండగా మిగతా 2,260 మంది బాలికలు కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నారు. దిలావర్‌పూర్ మండలంలో కేజీబీవీ పాఠశాల, కేజీబీవీ ఇంటర్ కళాశాలలున్నాయి. పాఠశాలలో 246 మంది బాలికలు చదువుతుండగా 260 మంది బాలికలు ఇంటర్ చదువుతున్నారు. బాలికల చదువులకు ఎలాంటి ఆటంకాలు కలుగ కుండా అన్ని మౌలికిక వసతులు కల్పిస్తున్నారు. ఈ ఏడాది 150 మంది బాలికలు దిలావర్‌పూర్ కేజీబీవీలో ప్రవేశం పొందారు.

మానసిక వికాసానికి యోగా.. ఆత్మ రక్షణకు కరాటే..

బాలికల్లో మానసిక వికాసాన్ని పాదు కొల్పేందుకు ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం యోగా శిక్షణ ఇస్తున్నారు. బాలికల్లో క్రమశిక్షణ, ఆత్మ రక్షణ, ఆత్మ విశ్వాసం కోసం కరాటే శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు యోగా, కరాటేతో పాటు పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిలో దాగి ఉన్న కళా నైపుణ్యం వెలికి తీసేందుకు సీఆర్‌టీలు ప్రయత్నిస్తున్నారు. కూచిపూడి, భరత నాట్యంతో పాటు సాంప్రదాయ, జానపద నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నారు. నిత్యం పుస్తకా లతో కుస్తీ పట్టే విద్యార్థులకు అప్పుడప్పుడు ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలతో కొంత ఉల్లాసం, ఉత్సాహం, ఉపశమనం లభించేందుకు ఆస్కారం ఉంది.

ప్రతీ నెల వైద్య పరీక్షలు...

కేజీబీవీల్లో చదువుతున్న బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో పాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రతీ నెల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నా రు. కంటి, పంటి, చెవి సమస్యలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్సలు చేస్తున్నారు. అవసరమైన మెడిసిన్ ఉచితంగా ఇస్తున్నాయి. కంటి సమస్యలుంటే కంటి అద్దాలను ఇస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలుంటే తీసుకోవలసిన జాగ్రత్తలపై బాలికలకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు.



దిలావర్‌పూర్‌లోని కేజీబీవీ జూనియర్ కళాశాల భవనం

మెస్ ఛార్జీల పెరుగుదల.. నూతన మెనూ అమలు..

ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి కేజీబీవీ బాలికలకు మెస్ ఛార్జీలు పెంచింది. దీంతో బాలికలు మరింత నాణ్యమైన ఆహారం తినేందుకు ఈ మెస్ ఛార్జీల పెంపుదల ఉపయోగపడనుంది. గడిచిన విద్యాసంవత్సరం వరకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులందరికీ ఒకే విధంగా నెలకు రూ. 1,225లు మెస్ ఛార్జీల కింద ప్రభుత్వం అందించేది. కానీ ఇప్పుడు అలా కాకుండా 6, 7వ తరగతుల విద్యార్థులకు రూ. 1,330లు, 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ. 1,540లు, ఇంటర్ విద్యా ర్థులకు రూ. 2,100లు చెల్లిస్తోంది.

ఈ విద్యా సంవత్సరం అమలవుతున్న నూతన మెనూ ఇదే..

ఉదయం: టమాట కిచిడి, సాంబారు, పూరి, రాగిజావా, ఉప్మా, పులిహోర, వడ, బోండా, చపాతీ, బూస్ట్, జీరా రైస్‌తో పాటు రోజుకు ఒక్కో రకమైన పండ్లను అందించాలి. వీటితో అరటి, జామ, బొప్పాయి, సపోటా లాంటి పండ్లు చేర్చాలి.

మధ్యాహ్నం: ఉడకపెట్టిన గుడ్డు, నెయ్యి, రసం, పెరుగు, టమాట పప్పు, అన్నం అందించాలి.



సాయంత్రం వేళ మెడిటేషన్ చేస్తున్న కేజీబీవీ బాలికలు



వ్యాయామం చేస్తున్న బాలికలు



రకరకాల యోగా విన్యాసాలు చేస్తున్న కేజీబీవీ బాలికలు



టీఎల్ఎంలను తయారు చేసిన కేజీబీవీ బాలికలు



బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ముథోల్, జూలై6 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని మోచి సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాఫూలే చౌరస్తాలో బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘసంస్కర్తగా, సమతావాదిగా దేశానికి విశేష సేవలందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, పీఏసీఎస్ డైరెక్టర్ దర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, నాయకులు రమేష్, మోహన్ యాదవ్, సాయినాథ్, తదితరులున్నారు.

అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు: డీఎం

భైంసా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం గిరి ప్రదర్శన కోసం భైంసా నుంచి ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లుగా డిపో మేనేజర్ హరి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 9న ఉదయం 11గంటలకు భైంసా బస్టాండ్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు అరుణాచలం యాత్రకు ప్రారంభమవుతుందని తెలిపారు. అరుణాచలంతోపాటు కాణిపాకం, వెల్లూర్ గోల్డెన్ టెంపుల్, చివరగా జోగులాం బ అమ్మవారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాకు 9959226005, 9640963321 సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు: కేవీపీఎస్

నిర్మల్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతుని ప్రకటిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డి.పోశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కార్మికుల కనీస వేతనాలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని రక్షించాలని, మనువాద కార్పొరేట్ విధానాలను ప్రతిఘటిస్తూ ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేవీపీఎస్ మద్దతు ఉంటుందని తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్మికవర్గానికి వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను బలవంతంగా అమలు చేస్తుందని, వీటిని వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం నికరంగా పోరాడుతుందని, కనీస వేతనాల కోసం ఏర్పరుచుకున్న కార్మికసంఘాల హక్కుల కోసంఉన్న చట్టాల రక్షణ కోసం కార్మిక వర్గ పోరాటాలకు కేవీపీఎస్ అండగా నిలబడుతుందని ఈ సందర్భంగా తెలిపారు. సనాతన ధర్మం ముసుగులో మనువాద భావాజాలాన్ని ఆర్ఎస్ఎస్ బీజేపీ హిందుత్వశక్తులు పథకం ప్రకారం ముందుకు తీసుకొ స్తుందన్నారు. ఈ విధానాన్ని సామాజిక శక్తులు అడ్డు కోవాలని కోరారు. బీజేపీ విధానాలపై దేశవ్యాప్త పోరాటానికి కేవీపీఎస్ సామాజిక శక్తులను కలుపుకొని పోరాడుతుందని తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా ఆర్టీసీ వినూత్న సేవలు





- ఆధ్యాత్మికం వైపు ఆర్టీసీ దారులు
- నిర్మల్ నుంచి పలు పుణ్యక్షేత్రాలకు సర్వీసులు
- పుణ్యక్షేత్రాలను ఎంపిక చేసుకుని ప్రత్యేక ప్యాకేజీలు
- నిర్మల్ నుంచి బయల్దేరి తిరిగి ఇక్కడికి చేర్చేలా ఏర్పాట్లు
- ఒక్కో యాత్రకు ఒక్కో ప్యాకేజీ
- ఆధ్యాత్మిక క్షేత్రాల దర్శనానికి ఆన్‌లైన్ బుకింగ్‌లు షురూ

ఖానాపూర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా ఆర్టీసీ వినూత్న సేవలు అందిస్తోంది. ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లాలంటే మొన్నటివరకు ఖచ్చితంగా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేది. రోజుల తరబడి శోధించి మంచి వాహనం, డ్రైవర్‌ను ఎంపిక చేసుకొని పుణ్యక్షేత్రాల యాత్రలకు వెళ్లేవారు. దైవ దర్శనానికి వెళ్లి వచ్చేవరకు యాత్రికులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఇకపై అటువంటి ప్రయాణ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీ సన్నద్ధమైంది. భక్తులకు ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శింపజేసేలా వినూత్న ప్యాకేజీలను తెరపైకి తెస్తోంది. ఈ ప్యాకేజీల ద్వారా బస్సు బయలుదేరిన ప్రాంతం నుండి తిరిగి ఆ ప్రాంతానికి భక్తులను సురక్షితంగా చేర్చేందుకు రానుపోను ప్రయాణ ఖర్చులను ఒక టికెట్‌గా రూపొందించి ఆధ్యాత్మిక యాత్రలకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఈ ఆధ్యాత్మిక యాత్రలు ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు భక్తులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందజేస్తాయని భావించి రూపకల్పన చేశారు. ఈ యాత్రలు సక్సెస్ అయితే దేశంలో మరిన్ని పుణ్యక్షేత్రాలు ప్యాకేజీలను ఆర్టీసీ ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది.

ఆధ్యాత్మిక 'మార్గం' వైపు ఆర్టీసీ..

జిల్లాకేంద్రమైన నిర్మల్ నుంచి దేశంలోని పలు పుణ్యక్షేత్రాలను ఆర్టీసీ సూపర్ లగ్జరీ సర్వీసులను నడిపేందుకు సిద్ధమైంది. నిర్మల్ నుంచి కాణిపాకం సిద్ధివినాయక స్వామి క్షేత్రం, వెల్లూరు శ్రీపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, పలని, పాతాళ శంభు (కరుంగలి మాల క్షేత్రం), మధుర మీనాక్షి, రామేశ్వరం జ్యోతిర్లింగ క్షేత్రం, శ్రీరంగం, శ్రీశైలం, భద్రాచలం, అన్నవరం, అలంపూర్ జోగులాంబ ఆలయాలకు ప్రత్యేకంగా బస్సుసర్వీసులను నడపనుంది.

నిర్మల్ నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు

తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోనే పలు ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిర్మల్ నుంచి ఆర్టీసీ సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ ప్యాకేజీలను ప్రకటించింది. ఆ సర్వీసులు బయల్దేరే తేదీలను అధికారులు ఇదివరకే ప్రకటించారు.



నిర్మల్ నుంచే ప్రత్యేక ప్యాకేజీలు

ఈనెల 9న నిర్మల్ నుంచి అరుణాచలానికి బయల్దేరనున్న సూపర్ లగ్జరీ సర్వీసును ఏర్పాటుచేశారు. 10న గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి చేరుకోనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరు శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం, సాయంత్రం అరుణాచలానికి చేరుకోనుంది. గిరిప్రదక్షిణ పూర్తిచేసుకుని 11న తెలంగాణాలోని గద్వాల జిల్లా అలంపూర్ జోగులాంబను దర్శించుకుని నిర్మల్ చేరుకుంటుంది. ఈ సర్వీసులకు ఆర్టీసీ ఒక్కో ప్రయాణికుడికి రానుపోను రూ.4,900లను ఛార్జీ చేస్తున్నట్లు చెప్తోంది. అలాగే ఈనెల 9న రాత్రి 8 గంటలకు నిర్మల్ నుండి శ్రీశైలానికి సూపర్ లగ్జరీ సర్వీస్‌ను నడుపుతున్నారు. ఈ ప్యాకేజీలో భాగంగా నిర్మల్ నుండి భక్తులను శ్రీశైలానికి తీసుకెళ్లి అక్కడ దర్శనానంతరం తిరిగి నిర్మల్‌కు తీసుకువచ్చేందుకు రూ. 2,250 రాను పోను ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు ఆర్టీసీ వెల్లడించింది. అలాగే ఈనెల 16న నిర్మల్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని జ్యోతిర్లింగ క్షేత్రమైన రామేశ్వరం యాత్రకు సూపర్ లగ్జరీ సర్వీసును ఆర్టీసీ నడుపుతోంది. ఆరు రోజులపాటు సాగు ఈ యాత్రలో నిర్మల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనం, తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం, పలని, పాతాళ శంభు (కరుంగలి మాల క్షేత్రం), మధుర మీనాక్షి, జ్యోతిర్లింగ క్షేత్రామైన రామేశ్వరం, శ్రీరంగం రంగనాయక విష్ణుమూర్తి దర్శనానంతరం 21వ తేదీ సాయంత్రానికి సర్వీసు నిర్మల్‌కు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇందుకుగాను ఒక్కో ప్రయాణికుడికి రూ. 7,500 చార్జి వసూలు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. భోజనం, వసతి ఖర్చులు ప్రయాణికులే భరించుకోవాలని చెప్తున్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

- పండరి ఆర్టీసీ డీఎం, నిర్మల్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలకు నిర్మల్ నుంచి ప్రత్యేక ప్యాకేజీలలో ఆర్టీసీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లే భక్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ముందస్తుగా మొబైల్ ఫోన్‌లో గానీ, ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో గానీ టికెట్ బుక్ చేసుకోవాలి. భవిష్యత్తులో నిర్మల్ నుంచి దేశవ్యాప్తంగా మరిన్ని ఆధ్యాత్మిక క్షేత్రాలకు సర్వీసులు నడుపుతాము.

సక్సెస్ అయితే దేశవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు

నిర్మల్ నుంచి చేపట్టిన ఆధ్యాత్మిక యాత్రల సర్వీసులు విజయ వంతమైతే దేశవ్యాప్తంగా మరిన్ని పుణ్యక్షేత్రాలను ఆర్టీసీ బస్సులను ప్యాకేజీల రూపంలో నడపాలని యోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం, అన్నవరం, ప్రయాగ్‌రాజ్, అయోధ్య, కాశీ లాంటి క్షేత్రాలకు నిర్మల్ నుంచి ప్రత్యేకమైన ప్యాకేజీ ద్వారా బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. ఆర్టీసీ అందిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. ముందస్తుగానే మొబైల్ ఫోన్ ద్వారా గాని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో గాని టికెట్ బుక్ చేసుకోవాలని చెబుతున్నారు.



పల్లకీసేవలో పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

ఘనంగా తొలి ఏకాదశి

- పురవీధుల్లో విఠల్, రుక్మాబాయి ఉత్సవమూర్తులకు శోభాయాత్ర
- పల్లకీ సేవలో పాల్గొన్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, జూలై6 (ఆంధ్రజ్యోతి): భైంసాలో ఆదివారం తొలి ఏకాదశిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము రాదేరాదే ప్రభాత్ భేరీ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన వేడుకలు మధ్యాహ్నం వరకు కన్నుల పండువగా సాగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పురవీధుల్లో విఠల్, రుక్మిణీబాయి ఉత్సవ మూర్తులకు పల్లకీలో ప్రతిష్ఠించి భారీ శోభాయాత్ర నిర్వహించారు. పలువురు చిన్నారులు విఠల్, రుక్మిణిబాయిల వేషాధారణతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, పారిశ్రామిక వేత్తలు రమేష్ మాందాని, రమేష్ మహాశెట్టివార్, సత్యనారాయణ వ్యాస్,గోవింద్ మాందని, ప్రదీప్ లడ్డా, మున్నాలడ్డా, బ్రహ్మణ్ సమాజ్ ప్రతినిధి సందీప్ కులకర్ణి, ఎంసీటీ చైర్మన్ డా.నగేష్, బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాంనాథ్, ప్రతినిధులు రావుల పోశెట్టి, గాలి రాజులతో పాటు పలువురు విఠల్, రుక్మిణీబాయిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఉత్సవ మూర్తులకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌తోపాటు ఇతరులందరూ హారతినిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముథోల్‌లో..

ముథోల్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం తొలి ఏకాదశి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలు బూని స్థానిక ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు చేశారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిలాడాయి. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

కుభీర్‌లో..

కుభీర్: మండల కేంద్రంతోపాటు పల్సి, పార్డి(బి), మాలేగాం, పార్డి (కే), నిగ్వా, పాంగర్‌పాడ్ తదితర గ్రామాల్లో ఆదివారం తొలిఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంలో వేకువ జామున దేవతామూర్తులకు పంచామృత స్నానం, పట్టు వస్త్రాలను సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

కుంటాలలో..

కుంటాల: మండలంలో ఏకాదశి పండుగను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఓలా గ్రామంలో శ్రీ రుక్మిణి సహిత పాండురంగ ప్రసన్న ఏకాదశి మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం, తులసి అర్చన, అఖండ నవగ్రహ పూజ ప్రారంభం, నవగ్రహ హోమము, సామూహిక కుంకుమార్చన, దీపాలంకరణ, పల్లకి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం కాగడ హారతి, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఓలా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేయండి

- కాంగ్రెస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ దిశానిర్దేశం
- ఖానాపూర్ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ఖానాపూర్, జూలై6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త క్షేత్రస్థాయిలో పని చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఆదివారం ఖానాపూర్ మండలంలో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ విస్తృతంగా పర్యటించారు. శనివారం రాత్రి ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే బస చేసిన బొజ్జుపటేల్ ఆదివారం తెల్లవారు జాము మార్నింగ్ వాక్ కార్యక్రమంతోనే ప్రజల వద్దకు వెళ్లారు. తెల్లవారు జామున క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరిన ఎమ్మెల్యే మండలంలోని బాదనకుర్తి గ్రామంలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు చరయలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఖానాపూర్, పెంబి మండలాల ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కార్యకర్తలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతీ కార్యకర్త బాధ్యతగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హులైన వారిని గుర్తించి వారి పేర్లతో కూడిన జాబితాను నేరుగా తనకే అంద జేయాలన్నారు. కార్యకర్తల సమావేశానంతరం మండలంలోని సింగాపూర్ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అక్కడ పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాజీద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజుర సత్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, మున్సిపల్‌మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, శెట్టి శ్యామ్మోహన్ రావు, జన్నారపు శంకర, కట్ట శ్రీనివాస్, సార్ల నర్సయ్య, గుడాల రాజన్న, లక్ష్మీరాజం, గాజుల గంగన్న, తదితరులున్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్



సమావేశంలో పాల్గొన్న సమరసింహా రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రతినిధులు

'స్థానిక' ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి

- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహరెడ్డి

భైంసా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ యువజన విభాగం శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని యూత్ కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సమరసింహరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన ముథోల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలన్నారు. పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సంగ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయభేరి కోసం ప్రణాళికబద్ధమైన విధానాలతో, పటిష్టవంతమైన చర్యలతో ముందుకు సాగాలన్నారు. యూత్ కాంగ్రెస్ శ్రేణులు తమ తమ ప్రాంతాల్లోని ప్రజానీకానికి అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతమైన విధానాల ద్వారా తోడ్పాటునివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ముథోల్ నియోజక వర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సుమన్, ముథోల్ నియోజకవర్గయూత్ అధ్యక్షుడు మహ్మద్ షఫీ, తదితరులు ఉన్నారు.



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మోహన్‌రావ్ పాటిల్, తదితరులు



సారంగాపూర్‌లో జయంతి వేడుకలో బీజేపీ నాయకులు



కల్లూరులో శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు

జాతీయవాద దార్శనికుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ

భైంసా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత కోసం బాధ్యతాయుతంగా పాటుపడి దేశంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయ మార్గం చూపిన మహోన్నతమూర్తి డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ అని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ 33ఏళ్లలోనే అసాధారణ స్థాయిలో రెండు పర్యాయాలు కలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్‌చాన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహించిన మేధావని కొనియాడారు. ఆల్ ఇండియా హిందూ మహాసభ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా దేశమంతా విస్తృత పర్యటన గావించి జనజాగృతికి, జాతీయ భావాలు పెంపొందించేందుకు అనిర్వచనీయమైన సేవలు అందించారని అన్నారు. నేటి యువత శ్యామాప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని మార్గదర్శకంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్యామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ శ్రేణులు ఘన నివాళులర్పించాయి. కార్యక్రమంలో బీజేపీ ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, ప్రధాన కార్యదర్శి దగడే శ్రీకాంతఖ. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధులు రావుల పోశెట్టి, కాసర్ల ప్రవీణ్, గాలి రాజు, లింగోజీ పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పసుల నవీన్ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఆయన చిత్రటాపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమైఖ్య భారతావని కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు శ్యామా ప్రసాద్‌ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు బబ్లు శీను, సోషల్ మీడియా కన్వీనర్ దిగంబర్ పటేల్, రజనీకాంత్, నవీన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గుద్దేటి ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రం సారంగాపూర్‌లో గల అంబేడ్కర్ చౌక్ వద్ద ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, నాయకులు శ్రావణ్‌కుమార్, వీరయ్య, సాహెబ్‌రావు, చెన్న రాజేశ్వర్, సాగర్‌రెడ్డి, నర్సయ్య, రాజురెడ్డి, ఎల్లన్న, విలాస్, నారాయణ, రమణయ్య, చారి, తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఈయన అడుగుజాడల్లో నడవాలని మండల బీజేపీ అధ్యక్షురాలు నీరం సుష్మారెడ్డి కోరారు. మాజీ సర్పంచ్ రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి సాయినథ్ మాట్లాడుతూ బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందంటే అది శ్యామాప్రసాద్ ముఖర్జీ కృషేనన్నారు. ఎమ్మెల్యే పవార్‌రామారావు పటేల్ ఆదేశానుసారం జిల్లా రాష్ట్రకమిటీ సూచనల కార్యక్రమాన్ని చేపట్టామాన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, దత్తురామ్ పటేల్, సిద్ధిరామ్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు మహేందర్, సత్యనారాయణ రెడ్డి, బాలాజీ పటేల్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి శివ, ప్రోగ్రాం కో కన్వీనర్ నాగన్న, బూత్ అధ్యక్షుడు సాయినాథ్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు గంగాధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



చుచుంద్ గ్రామంలో..